## నిర్వాసితులకు న్యాయం చేయాలి : బీఆర్‌ఎస్


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాలకుర్తి, సెప్టెంబర్ 25: మండలంలోని ఎల్లారాయి ని తొర్రూరులో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ని ర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించడంతో వారు వీధిన పడ్డారని, ఈ నేపథ్యం లో నిర్వాసితులకు న్యా యం చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పస్నూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డబుల్‌బెడ్ రూం ఇండ్లకు గ్రామసభలో లబ్ధిదారులను ఎంపిక చేశాకే వీరు అక్కడ నివాసముంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారిని ఖాళీ చేయించినందున అధికారులు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మాజీ సర్పంచ్ నాయిని మల్లారెడ్డి, పాము శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాళోజీ కళాక్షేత్రానికి చుక్క సత్తయ్య పేరు పెట్టాలి

లింగాలఘనపురం, సెప్టెంబర్ 25 : హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రానికి ఒగ్గుకథ పితామహుడు చుక్క సత్తయ్య పేరు పెట్టాలని బహుజన కులాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాలఘనపురం మండలం మాణిక్యపురానికి చెందిన చుక్క సత్తయ్య ఒగ్గు కళను ప్రపంచం నలు దిశలా వ్యాపింపచేశారని తెలిపారు. దీనిపై గతంలోనే తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకురాగా వారు సానుకూలంగా స్పందించి సీఎంతో మాట్లాడుతామని తెలిపారని గుర్తు చేశారు.

## ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల కోసమే 'ప్రశస్త'


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

దేవరుప్పుల, సెప్టెంబర్ 25: ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను గుర్తించి వారికి సదుపాయాలు కల్పించడానికే ప్రశస్త కార్యక్రమం చేపట్టినట్లు విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సింహారావు అన్నారు. మండల విద్యావసరుల కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరాన్ని ఎంఈవో కళావతి అధ్యక్షతన నిర్వహించారు. నర్సింహారావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను గుర్తించి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సేవా దృక్పథంతో చేపట్టే సర్వేతో ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలు, పరీక్షల సమయంలో ప్రత్యేక వసతులు సమకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ గోలి తిరుపతిరెడ్డి, కామారెడ్డి గూడెం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఎమ్మార్సీ సిబ్బంది గోలి రవీందర్‌రెడ్డి, నర్సింహులు, సంధ్య, బుర్ర యాకస్వామి, రాంచందర్, మంజుల, యాకయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

స్టేషన్‌ఘన్‌పూర్,సెప్టెంబర్ 25 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జితేందర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలతోపాటు అధ్యాపకుల అటెండెన్స్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు బాధ్యతగా పనిచేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించాలని, విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కమలాకర్, అధ్యాపకులు ఎస్ సాంబమూర్తి, నవీన్, ఎం కరుణాకర్, సీహెచ్ లావణ్య, ఎస్ మోహన్, కే శ్వేత, సునీత, సౌభాగ్యలక్ష్మి, థామస్, ప్రేమ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వయో వృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలి

### కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 25 : అక్టోబర్ 1వ తేదీ నుంచి నిర్వహించే అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాల ప్రచార కరపత్రాలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయో వృద్ధుల సంరక్షణ చట్టం-2007పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి ఆహారం, దుస్తులు, నివాసం, ఆరోగ్య సేవలకు సంబంధించిన సమస్యల ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 26న జిల్లాలోని వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007పై అవగాహన సదస్సు, 29న గ్రామీణ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సంరక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు. 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో 'గ్రాండ్ పేరేంట్స్ డే'ను నిర్వహించాలన్నారు. అక్టోబర్ 1వ తేదీన జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కొనసాగించాలని కోరారు.

## రేపు జిల్లా స్థాయి 'వేస్ట్ టూ వెల్త్' ఎగ్జిబిషన్

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 25 : జనగామ పట్టణంలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జిల్లా స్థాయి 'వేస్ట్ టూ వెల్త్' ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈవో కే రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎన్‌జీసీ ఎకో క్లబ్ 60 పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు, ఉపాధ్యాయుడు చొప్పున మొత్తం 180 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థి బృందాలు ఏదైనా ఉపయోగించని మెటీరియల్ సాయంతో ఉపయోగకరమైన, ఆకర్షణీయమైన కళ/క్రాఫ్ట్ ఆకృతులుగా తయారు చేయాలని రాము సూచించారు. ఉత్తమ ప్రదర్శనకనబర్చిన విద్యార్థి బృందాలకు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.1000 చొప్పున అందజేస్తామన్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు టీజీ ఎన్‌జీసీ ప్రయాణ భత్యంతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందన్నారు.

## దేవరుప్పుల ఎంఈవోగా కళావతి



దేవరుప్పుల, సెపెటబర్ 25: మండల విద్యాశాఖాధికారిగా గుంటిపల్లి కళావతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత విద్యాసంవత్సరం నుంచి ఎంఈవో పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళావతి ఎంఈవోగా నియమితులయ్యారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేశారు

## ట్రైనీ ఎస్సైలకు స్టేషన్ అలాట్

సుబేదారి, సెప్టెంబర్ 25 : శిక్షణ పూర్తి చేసుకున్న ఏడుగురు ప్రొబేషనరీ ఎస్సైలను పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా బుధవారం రెండు విడుతలుగా పోలీసు స్టేషన్లకు అలాట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీ పవన్ కాజీపేట-మామునూరుకు, బీ హేమలత సుబేదారి-వర్ధన్నపేటకు, బీ శివ మిల్స్‌కాలనీ-రఘునాథ్‌పల్లికి, బీ సుజిత్ ఆత్మకూరు-హనుమకొండ, ఏ మధు జనగామ-ఇంతేజార్‌గంజ్, ఎల్ దిలీప్ నర్సంపేట-హసన్‌పర్తి, పీ భాగ్యశ్రీ స్టేషన్‌ఘన్‌పూర్-పరకాలకు అలాట్ అయ్యారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


థియేటర్‌లో ప్రకటనలను తిలకిస్తున్న జడ్జి రవీంద్ర శర్మ

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 25 : జనగామ జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి డీ రవీంద్ర శర్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దేవి థియేటర్‌లో లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రకటనల రూపంలో వీడియో ప్రదర్శించారు. దీనిని జనగామ వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీ విక్రమ్‌తో కలిసి ఆయన తిలకించారు. రవీంద్రశర్మ మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసును రాజీ చేసుకోవడం వల్ల వారి సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుందని తెలిపారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు, యాక్సిడెంట్ కేసులు ఏవైనా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవడానికి వివిధ రకాల ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి


మల్కాపూర్‌లో స్ప్రే చేయిస్తున్న డాక్టర్ కుషాలి

చిల్పూరు, సెప్టెంబర్ 25 : వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ కుషాలి అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో డెంగ్యూ పాజిటివ్ వచ్చిన బాధితుడి ఇంటి పరిసరాల్లో స్ప్రే చేయించారు. కుషాలి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రజలు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనారోగ్యంతో ఉన్న వారు వెంటనే దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ సీహెచ్‌వో వెంకటస్వామి, సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

## తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


తరిగొప్పులలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

తరిగొప్పుల, సెప్టెంబర్ 25 : పత్తి , వరి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పత్తి, వరి పంటలను వ్యవసాయ శాఖ జనగామ డివిజన్ సహాయ సంచాలకులు బీనా, నర్మెట, ఏవో సంతోష, ఈవోలతో కలిసి పరిశీలించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ పంటలకు తెగుళ్లు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పత్తిలో బాక్టీరియా, నల్లమచ్చ తెగులు, కాయకుళ్ల తెగులు, పూత, గూడకాయ రాలడం వంటి వాటిని నివారించేందుకు వ్యవసాయ శాఖ సూచించిన మందులను స్ప్రే చేయాలని కోరారు.

## ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా

### మిషన్‌భగీరథ సీఈ లలిత


సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 25 : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని జీపీలలో పనిచేస్తున్న మంచినీటి సహాయకులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంచినీటి సరఫరాలో మరమ్మతులు, ఇతర అంశాలపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన మిషన్ భగీరథ సీఈ లలిత మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వాటర్ మెన్‌లకు జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రధానంగా ప్లంబింగ్, పైప్ లైన్ లీకేజీలు, చేతిపంపులు, ఎలక్ట్రికల్ మోటార్ల, మరమ్మతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ కృష్ణయ్య, గ్రిడ్ ఈఈ రాజయ్య, ఇంట్రా ఈఈ శ్రీకాంత్, డీఈ కిరణ్‌కుమార్, ఏఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**చిల్పూరులో..**

చిల్పూరు : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత గ్రామాల్లోని మంచినీటి సహాయకులపై ఉందని జిల్లా పంచాయతీ అధికారి స్వరూపారాణి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని మంచినీటి సహాయకులతో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎంపీవో మధుసూదనాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వరూపారాణి మాట్లాడుతూ పైపులైన్ల లీకేజీ, ఇతర మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపెండ్యాల పంచాయతీ కార్యదర్శి శేషురెడ్డి, కారోబార్ సారయ్య పాల్గొన్నారు.

## నేడు చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 25 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు గురువారం కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి బీ రవిందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో వెంకన్న

కొడకండ్ల, సెప్టెంబర్ 25 : ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రమోహన్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు బాలికలను చేరదీసిన పోలీసులు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 25 : హైదరాబాద్‌లోని ఓ రిహాబిలిటేషన్ సెంటర్ నుంచి పారిపోయి బుధవారం జనగామ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఇద్దరు మైనర్ బాలికలను చేరదీసినట్లు అర్బన్ ఎస్సై ఎం శ్వేత తెలిపారు. స్మార్ట్ ఫోన్ యాప్ ఇన్‌స్టాగ్రామ్‌కు అడిక్ట్ అయిన బాలికలు కావడంతో వారిని కుటుంబీకులు రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించినట్లు పేర్కొన్నారు. ఇందులో ఒకరు మన జిల్లాకు సంబంధించిన బాలిక కాగా, మరొకరు హైదరాబాద్‌కు చెందిన బాలిక అని తెలిపారు. ఇద్దరు బాలికల మధ్య రిహాబిలిటేషన్ సెంటర్‌లో స్నేహం ఏర్పడడంతో కలిసి పారిపోయి జనగామకు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. బాలికలిద్దరిపై హైదరాబాద్ పీఎస్‌లో మిస్సింగ్ కేసు కూడా నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం బాలికలిద్దరినీ స్థానిక సఖీ కేంద్రంలో సంరక్షణ కోసం తరలించినట్లు ఈ సందర్భంగా ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

## పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్‌ఆర్‌ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

## రైతులకు కంగన క్షమాపణ

### రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రై సిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

**ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!**

**ప్రత్యేక కథనం - 8**

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

### ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

### ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరఫున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
**91827 77711**

### టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏఐ సిటీ పూర్తయిన తర్వాత ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన భవనాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అయినప్పటికీ అసంపూర్తి, ప్రైవేటు భవనాన్ని ఎంచుకోవడం వెనక అసలు ఉద్దేశం వేరే ఉందన్న చర్చ జరుగుతున్నది.

# స్క్వాల్ ఫార్మేషన్‌తోనే కూలిన చెట్లు

- పునరుద్ధరణ జరగాలంటే వందేండ్లు
- నిర్ధారణకు వచ్చిన అటవీ శాస్త్రవేత్తలు
- విపత్తును పసికట్టిన వన్యప్రాణులు

ములుగు, సెప్టెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంతోపాటు అరేబియా సముద్రంలో గత నెల 31న ఏర్పడిన తుఫాన్‌ల కారణంగా గంటకు 125 కిలోమీటర్ల వేగంతో వీచిన భారీ గాలుల ఒత్తిడితో ఏర్పడిన స్క్వాల్ ఫార్మేషన్‌తోనే ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవిలో భారీ ఎత్తున చెట్లు నేలకూలాయని అటవీ శాఖ పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో అటవీశాఖ అధికారులతోపాటు 10 నుంచి 12 సంస్థలకు చెందిన నిష్ణాతులైన శాస్త్రవేత్తలతో వర్క్‌షాపు నిర్వహించి విధ్వంసానికి గల ప్రధాన కారణాలను అంచనా వేశారు. తాడ్వాయి, మేడారం, పస్రా అటవీ ప్రాంతంలో ఆగస్టు 31న జరిగిన దుర్ఘటన వల్ల 332 హెక్టార్లలో అడవికి నష్టం జరిగి 50 వేలకు పైగా చెట్లు నేలకూలాయని చెప్పారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.30 కోట్ల నష్టం జరిగిందని, కలపతో కలుపుకుంటే రూ.100 కోట్ల నష్టం వరకు ఉంటుందని తెలిపారు. పర్యావరణం దృష్టితో చూస్తే రూ.100 కోట్లకు పైగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. దట్టమైన 100 నుంచి 200 ఏండ్ల చెట్లు కూలాయని, అంతటి దట్టమైన అడవి తిరిగి రూపొందాలంటే వందేండ్లు పడుతుందని వివరించారు. నష్టం జరిగిన ప్రదేశంలో చెట్లను కాపాడుకుంటే ఐదేండ్లలో అడవి ఏర్పడుతుందని, భారీ వృక్షాలు కావాలంటే చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల్లో ఒకేసారి వచ్చిన తుఫాను వల్ల భారీ ఒత్తిడితో గాలులు వీచి మేఘాలు ఒక దానిపై ఒకటి వచ్చిన సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు నిర్ధారణకు వచ్చారని చెప్పారు. నష్టం జరిగిన రోజు సంఘటన ప్రాంతంలో 25 నుంచి 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతోపాటు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, కొంత ప్రాంతంలో 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్టు కనుగొన్నామని తెలిపారు. వర్క్ షాపులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఎవరూ ఇంతటి తీవ్రతను చూడలేదని చెప్పారని వివరించారు. గతంలో మధ్యప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవుల్లోని అడవుల్లో కొద్ది ప్రాంతంలో చెట్లకు నష్టం జరిగిందని, ప్రస్తుతం తాడ్వాయి అడవుల్లో భారీ మొత్తంలో నష్టం జరిగిందని చెప్పారు. చెట్లు కూలిన ప్రాంతంలో వన్యప్రాణులకు హాని జరగలేదని, విపత్తును ముందే తెలుసుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్టుగా నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. దుర్ఘటనకు గల కారణాలపై నివేదిక రూపొందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కార్యాచరణ చేపడతామని తెలిపారు.

## ఆరోగ్య ప్రదాత కేసీఆర్


ఇటీవల విడుదలైన ఫలితాల్లో సింగరేణి వైద్య కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. - గోదావరిఖని

## పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి..


వరంగల్ జిల్లా నెక్కొండలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి కార్మికుల కాళ్లు కడిగారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. నెక్కొండ, ముదిగొండకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు బస్కె శ్రీనివాస్, ఓరుగంటి ప్రమీలను ఘనంగా సత్కరించారు. - నెక్కొండ

